క్లుప్తంగా

పరామర్శ



మంగపేట: మండలంలోని కమలాపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు నిమ్మల రాంబాబు తల్లి గంగమ్మ ఇటీవల మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబాన్ని రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్, భద్రాద్రి కొత్తగూడెం కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య ఆదివారం పరామర్శించారు. పార్టీ మండల అధ్యక్షుడు మైల జయరాంరెడ్డి, పార్టీ నాయకులు విజయ్, సయ్యద్‌హుస్సేన్ ఉన్నారు.

మొగుళ్లపల్లి: మండలంలోని ఎల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన జిల్లా సమాచార హక్కు చట్టం యునైటెడ్ ఫోరం ఫర్ ఆర్టీఐ జిల్లా కన్వీనర్ చర్లపల్లి వెంకటేశ్వర్లు ఇటీవల రోడ్డుప్రమాదంలో గాయపడ్డాడు. దీంతో ఆదివారం రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కామిడీ సతీష్‌రెడ్డి, ఆర్టీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు కమలాకర్ పరామర్శించారు.

ఉనుక లారీ బోల్తా..



టేకుమట్ల: అదుపు తప్పి ఉనుక లారీ బోల్తా పడిన సంఘటన మండలంలోని కలికోట శివారు మానేరులో శనివారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. పెద్దపల్లి జిల్లాకు చెందిన ఇటుక బట్టీల యజమాని మండలం నుంచి ఉనుకను తీసుకెళ్తున్న క్రమంలో ఎదురుగా వస్తున్న వాహనానికి దారి ఇచ్చే క్రమంలో లారీ పక్కనే ఉన్న ఇసుక గుంతలో పడిపోయినట్లు లారీ డ్రైవర్ తెలిపారు. కాగా ఈ సంఘటనలో ఎవరికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

మహిళ అస్థిపంజరం లభ్యం

వాజేడు: మండల పరిధిలోని పూసూరు వద్ద గోదావరి బ్రిడ్జి 27 పిల్లర్ సమీపంలో ఇసుకలో గుర్తు తెలియని మహిళ అస్థిపంజరం లభ్యమైనట్లు ఎస్సై రాజ్‌కుమార్ ఆదివారం తెలిపారు. ఎస్సై తెలి పిన వివరాల ప్రకారం.. బ్రిడ్జి సమీపంలో ఇసుకలో మహిళ మృతదేహం ఉన్న సమాచారం రావడంతో వాజేడు, ఏటూరునాగారం తహసీల్దార్ కార్యాలయాల సిబ్బంది, ఏటూరునాగారం నుంచి పోలీసులు, వైద్య సిబ్బందితో కలిసి అక్కడికి వెళ్లి పరిశీలించినట్లు తెలిపారు. మహిళ మృతి చెంది సుమారుగా 20 రోజులపైనే అయి ఉంటుందని అంచనకు వచ్చినట్లు తెలిపారు. అస్థిపంజరంలా ఉన్న మృతదేహాన్ని వైద్యులు పోస్టుమార్టం చేశారు. సమీపంలో ఇసుకలోనే మృత దేహాన్ని పూడ్చిపెట్టారు. మృతి చెందిన మహిళ ఎవరూ, ఏ ఊరు అనే విషయాలు మాత్రం తెలియరాలేదు. మహిళను గుర్తు పట్ట డానికి ఎలాంటి ఆధారాలు లభించలేదన్నారు. మ హిళ ప్రమాదవశాత్తు మృతి చెందిందా? ఎవరైన హత్య చేసి అక్కడ పడేశారా? ఇంకా ఏదైనా జరిగిందా? అనే కోణంలో పోలీసులు ఆలోచిస్తున్నట్లు తెలి పారు. కాగా అస్థి పంజరంపై గులాబి రంగు చీరె, తలకు గీతల తువ్వాల, సమీపంలో చెప్పులు, సు న్నం, పొగాకు ఉన్నట్లు గుర్తించారు. సదరు మహిళ ఎవరనే విషయం తెలిస్తే వాజేడు పోలీసులకు స మాచారం ఇవ్వాలని ఎస్సై కోరారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

రేషన్ బియ్యంపై మక్కువ

- సన్న బియ్యం అందజేస్తున్న ప్రభుత్వం
- ఆసక్తి చూపుతున్న ప్రజలు



రేషన్ దుకాణం వద్ద సన్న బియ్యం తీసుకుంటున్న ప్రజలు

వాజేడు: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన సన్న బియ్యం పంపిణీని పేద ప్రజలు సద్వినియోగం చేసుకుంటున్నారు. మండలంలో 12 రేషన్ దుకాణాలు ఉండగా ఇందులో 224 అన్న యోజన అంత్యోదయ కార్డులు, 7738 తెల్ల రేషన్ కార్డులు ఉన్నాయి. అన్నయోజన అంత్యోదయ కార్డులకు ఒక్కో దానికి 35 కేజీల బియ్యం ఇస్తుండగా తెల్ల రేషన్ కార్డులో ఉన్న సభ్యులకు ఒక్కొక్కరికీ ఆరు కేజీల చొప్పున బియ్యం ఉచితంగా ఇస్తున్నారు.

మండలానికి వచ్చింది 1402.60 క్వింటాలు

మండలంలోని పేదలకు ప్రభుత్వం ద్వారా 1402.60 క్వింటాల బియ్యం పంపిణీ చెయ్యాల్సి ఉంది. అందుకు గాను పూర్తి స్థాయి బియ్యం ఏప్రిల్ నెల మొదటి రోజు నాటికే రేషన్ దుకాణాలకు చేరాయి. గతంలో దొడ్డు బియ్యం తీసుకోవడానికి వెనుకా ముందు ఆలోచించే ప్రజలు ఆలస్యం అయితే సన్న బియ్యం అందుతాయో? లేదో? అనే ఆలోచనతో లైన్లో నిలబడి ముందుగానే తీసుకున్నారు. ప్రజలు ఆసక్తి చూపడంతో ఇప్పటి వరకు 1260.61 క్వింటాల బియ్యం పంపిణీ జరిగినట్లు తెలుస్తుంది. గతంలో ఎన్నడు లేని విధంగా పేద ప్రజలు సన్న బియ్యాన్ని చౌక ధరల దుకాణం నిర్వాహకులు తెలిపారు.

బియ్యం బాగున్నాయి..



ప్రభుత్వం పంపిణీ చేసిన సన్న బియ్యం బాగున్నాయి. దొడ్డు బియ్యం తినే మాకు సన్న బియ్యం ఇవ్వడం సంతోషం. కొత్త బియ్యం కావడంతో ముద్ద అవుతుంది. కొంచెం మాగితే అన్నం ఎదుగు అవుతుంది. ప్రభుత్వానికి ధన్యవాదాలు.

– దంతులూరి బుచ్చి సత్యనారాయణ వర్మ

మత్తు పదార్థాలకు బానిస కావొద్దు

- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారావు



యువకులను సన్మానిస్తున్న లక్ష్మీనర్సింహారావు

ఏటూరునాగారం: మాదకద్రవ్యాలకు బానిసలు కావొద్దని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు అన్నారు. మండల కేంద్రానికి చెందిన యువకులు యూట్యూబ్‌లో మాదకద్రవ్యాలకు యువత అలవాటు అయితే వారి జీవితం ఎలా చెడిపోతుందో అనే వీడియోను చిత్రీకరించారు. దీంతో ఆదివారం ఈ చిత్రాన్ని లక్ష్మీనర్సింహారావు చూసి వారిని అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల కేంద్రంలోని శివాలయం వీధికి చెందిన యువకులు మాదకద్రవ్యాలపై అవగాహన కోసం యువత చెడిపోతున్నారని యూట్యూబ్ ఛానల్ ద్వారా మంచి సందేశాన్ని ఇవ్వడం అభినందనీయమన్నారు. ఇలాంటి మంచి వీడియోలను తీసి ప్రజల మన్ననలను పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రదీప్‌రావు, రఘు, ఖాజాపాషా, భాస్కర్‌రావు, రామకృష్ణ, చిప్ప నాగరాజు, దేపాక శ్రీరాములు, వావిలాల ముత్తయ్య, ఈశ్వర్, బోజారావు పాల్గొన్నారు.

విద్యార్థులకు మనోజ్‌రెడ్డి ఆదర్శం



మనోజ్‌రెడ్డిని సన్మానిస్తున్న సతీష్‌కుమార్

గోవిందరావుపేట: గ్రూప్–1కు ఎంపికైన ఏనుగు మనోజ్‌రెడ్డిని విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు కాట్రగడ్డ సతీష్‌కుమార్ అన్నారు. ఆదివారం మనోజ్ రెడ్డిని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, ఉపాధ్యాయులతో కలిసి పూర్వ విద్యార్థులు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గోవిందరావుపేట మండలం పస్రా గ్రామానికి చెందిన మనోజ్‌రెడ్డి పట్టుదలతో చదివి ఉద్యోగం సాధించడం గర్వకారణమని అన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

రేపు భూ భారతి చట్టంపై అవగాహన

చిట్యాల: మండలంలోని అన్ని గ్రామాల రైతులకు భూ భారతి ఆర్ఓఆర్ చట్టం–2025పై ఈ నెల 22న మండల కేంద్రంలోని రైతు వేదికలో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ హేమ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని రైతులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

రజతోత్సవ సభకు తరలిరావాలి

చిట్యాల: వరంగల్‌లోని ఎల్కతుర్తిలో ఈనెల 27న నిర్వహించే బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు ప్రతి ఒక్కరూ తరలిరావాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు అల్లం రవీందర్ కోరారు. ఆదివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు, ప్రయోజనాల కోసమే కేసీఆర్ పార్టీని స్థాపించారని అన్నారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసమే ఆహర్నిషలు కష్టపడి పనిచేస్తునట్లు పేర్కొన్నారు. పదేళ్ల పాలనలో కేసీఆర్ దేశంలోనే రాష్ట్రాన్ని మొదటి స్థానంలో తీర్చిదిద్దారని అన్నారు. మండలంలోని ప్రతి గ్రామం నుంచి అత్యధిక సంఖ్యలో బహిరంగ సభకు తరలిరావాలని కోరారు.

ఆన్‌లైన్‌లో పేరు నమోదు చేయాలి



న్యాయం చేయాలని వేడుకుంటున్న సంపత్ దంపతులు

మల్హర్: గ్రామ పంచాయతీ పోర్టల్‌లో పంచాయతీ కార్మికురాలుగా తమ పేరును ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని మండలంలో నాచారం గ్రామ పంచాయతీకి చెందిన దొగ్గెల సౌందర్య–సంపత్ దంపతులు కలెక్టర్‌ను వేడుకుంటున్నారు. ఈ సందర్భంగా సౌందర్య మాట్లాడుతూ.. తన భర్త సంపత్ గత 2015 సంవత్సరం నుంచి 6 సంవత్సరాలు పంచాయతీ కార్మికునికి పని చేశాడని తెలిపింది. కిడ్నీ సమస్య కారణంగా తన భర్త స్థానంలో గత నాలుగు సంవత్సరాల నుంచి సఫాయి కార్మికురాలుగా పని చేస్తున్నాని పేర్కొన్నారు. ఎలాంటి సమాచారం లేకుండానే పంచాయతీ అధికారులు ఆన్‌లైన్‌లో తన భర్త పేరును తొలగించారని ఆరోపించారు. ఆన్‌లైన్ నమోదు విషయమై మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ద్వారా జిల్లా డీపీఓ నారాయణ రావు, ఎంపీఓ విక్రమ్‌కు విన్నవించిన పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారని, నిరుపేద కుటుంబం చెందిన తమకు న్యాయం చేయాలని వేడుకుంటున్నారు. దీనిపై ఎంపీఓ విక్రమ్‌ను వివరణ కోరగా జీపీ జనభా ప్రతిపాదికన నలుగురి పంచాయతీ మల్టీ వర్కర్స్ కార్మికుల పేర్లు మాత్రమే ఆన్‌లైన్‌లో నమోదు అయ్యాయి. ప్రభుత్వ జీఓ ప్రకారం పాత పేర్లు తొలగించడం, కొత్తవి నమోదు చేసే అధికారం తమకు లేదని తెలిపారు.

రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలి



పాదయాత్రలో పాల్గొన్న నాయకులు

భూపాలపల్లి రూరల్: రాజ్యాంగాన్ని రక్షించుకోవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సుంకరిరామ చంద్రయ్య అన్నారు. రాజ్యాంగా పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా ఆదివారం భూపాలపల్లి మండలంలోని కమలపూర్ మాజీ సర్పంచ్ తోట సంతోష్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలనే ఉద్దేశంతో పాదయాత్ర చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భానుడి భగభగలు



వెంకటాపురం(కె): నిర్మానుష్యంగా మారిన రోడ్డు

వెంకటాపురం(కె): మండలంలో భానుడు భగభగలతో ప్రతాపాన్ని చూపుతున్నాడు. ఆదివారం మండలంలో ఎండలు నిప్పల కోలిమిని తలపించాయి. దీంతో ప్రజలు ఎండ వేడిమికి తట్టుకోలేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మండలంలో 38 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు అవుతుండటంతో ప్రజలు బయటటకు వచ్చేందకు భయందోళనలకు గురవుతున్నారు. ఉదయం ఆరు గంటల నుంచి 11 గంటల వరకు సాయంత్రం ఐదు గంటల తర్వాతనే బయటకు వస్తున్నారు. ఎండ వేడిమి తట్టుకోలేక ప్రజలు చెట్ల కింద సేద తీరుతున్నారు. దీంతో మండల కేంద్రంలో రోడ్లు అన్ని నిర్మానుష్యంగా మారాయి. కూరగాయల వ్యాపారులు ఎండ వేడికి ప్రజలు బయమటకు రాక పోవడంతో కూరగాయలను కాపాడుకునేందకు పరాదాలు కప్పి దుఖాణాలను మధ్యాహ్నం సమయంలో బంద్ చేస్తున్నారు. కొందరు గొడుగు సహాయంతో బయటకు వస్తున్నారు.



గొడుగు కింద చిన్నారిని తీసువెళ్తూ..



కూరగాయలపై కప్పి ఉంచిన పరదా

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న లక్ష్మీనారాయణ

మంగపేట: మండలంలోని మల్లూరు పంచాయతీ పరిధిలోని మొట్లగూడేనికి చెందిన రైతు యాలం నర్సింహారావు ఇటీవల ఆత్మహత్యకు చేసుకున్నాడు. దీంతో బాధిత కుటుంబానికి బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్‌బాబు ఆర్థిక సాయంగా పంపిన రూ.40,000లను ఆ పార్టీ మండల అధ్యక్షుడు కుడుముల లక్ష్మీనారాయణ ఆదివారం అందచేశారు. జిల్లా సీనియర్ నాయకులు తాటి కృష్ణ, మంగపేట ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ తోట రమేశ్, వైస్‌చైర్మన్ కాడబోయిన నరేందర్, సమ్మయ్య, నర్సింహులు, శ్రీనివాస్ యాదవ్, తిరుపతి, జనార్ధన్, ముకుందం, శ్రీహరి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నీరు ఎక్కువగా తాగాలి

- వైద్యాధికారి షోయబ్‌ఖాన్



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ షోయబ్‌కాన్

ఏటూరునాగారం: విద్యార్థులు ప్రతీ రోజు నీటిని ఎక్కువగా తాగాలని వైద్యాధికారి షోయబ్‌ఖాన్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని బాలికల డిగ్రీ కళాశాలలోని విద్యార్థులకు కిడ్నీ వ్యాధులపై షోయబ్‌ఖాన్ వివరించారు. కిడ్నీ వ్యాధులు రాకుండా సముతుల్య ఆహారం తీసుకోవాలన్నారు. పండ్లు, నీరు ఎక్కువగా తీసుకోవాలని, వ్యాయామం చేయాలన్నారు. బీపీ, షుగర్ కంట్రోల్‌లో ఉండే విధంగా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

చిన్నారుల నృత్యం చిత్రీకరణ



పాట చిత్రీకరణలో నృత్యం చేస్తున్న చిన్నారులు

టేకుమట్ల: చిన్నారులు చదువుతో పాటు ప్రతీ రంగంలో వారిలో ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు తల్లిదండ్రులు ప్రోత్సహిస్తున్నారు. షార్ట్ ఫిల్మ్‌లు, రీల్స్ వంటివి చిత్రీకరించి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేస్తూ వారి ప్రతిభను వెలికితీస్తున్నారు. అందులో భాగంలోనే మండల కేంద్రంలో ఫ్యాషన్‌జోన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డాన్స్ అకాడమీ విద్యార్థులతో రాజేశ్ నాయక్ నిర్మాణ సారథ్యంలో కొరియోగ్రాఫర్ శనిగరపు ప్రసాద్ ఆధ్వర్యంలో ఆదివారం చలివాగు వంతెన, పల్లె ప్రకృతి వనం, టేకుమట్ల–చిట్యాల ప్రధానరోడ్డు, పలు ప్రాంతాల్లో జానపద పాటను చిత్రీకరించారు. పాట చిత్రీకరణ సమయంలో చిన్నారులు ప్రదర్శిస్తున్న నృత్యానికి ప్రయాణికులు తిలకించి ఆనందం వ్యక్తం చేశారు.

తవ్వారు.. వదిలేశారు

- ప్రమాదకరంగా అడవి సోమన్‌పల్లి వంతెన
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



వంతెనపై గుంతలు ఉండటంతో నిలిచిన వాహనాలు

మల్హర్: జయశంకర్ భూపాలపల్లి–పెద్దపల్లి జిల్లాల సరిహద్దు మానేరుపై నిర్మించిన సోమనపల్లి వంతెన ప్రమాదకరంగా ఉంది. పెదపల్లి జిల్లా మంథని మండలం సోమన్పల్లి–జయశంకర్ జిల్లా మల్హర్ మండలం కొయ్యూర్ పీవీనగర్ సమీపంలో మానేరు నదిపై ఈ వంతెనను 1971 సంవత్సరంలో ప్రారంభించారు. ఈ వంతెన నిర్మాణ అనంతరం ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాళేశ్వర దేవస్థానానికి భక్తుల రాకపోకలతో పాటు, తూర్పు మండలాలకు, భూపాలపల్లి, వరంగల్, ఉమ్మడి కరీంనగర్‌కు రహదారి సౌకర్యం మెరుగుపడింది. కానీ ప్రస్తుతం ఈ వంతెన ప్రమాదకరంగా మారింది.

ప్రమాదకరంగా గుంతలు

సోమన్‌పల్లి వంతెన మీద ఉన్న రహదారి సిమెంట్ కొట్టుకపోయి, వంతెన పిల్లర్ల మధ్య వేసిన ఇనుప రాడ్లు, పట్టీలు ఊడిపోయి పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. బ్రిడ్జి మరమ్మతులకు ప్రభుత్వం రూ.43లక్షలు మంజూరు చేసింది. దీంతో పెద్దపల్లి ఆర్‌అండ్‌బీ అధికారులు సంబంధిత కాంట్రాక్టర్‌తో వంతెనకు ఓ వైపు ఉన్న పిల్లర్ల మధ్యలోని గుంతలకు పూడ్చేందుకు ఇనుప పట్టీలను తొలగించారు. పట్టీలను తొలగించిన భాగంలో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి ప్రమాదకారంగా మారాయి. గుంతలు తీసి 15 రోజులు గడుస్తున్న సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో ఈ వంతెనపై ప్రయాణించడం ప్రాణసంకటంగా మారుతుందని వాహనదారులు వాపోతున్నారు. ప్రయాణికులు ఏమాత్రం ఏమరపాటుగా వెళ్లిన ప్రమాదాలు చోటు చేసుకొనే పరిస్థితి నెలకొంది. ఈ వంతెన గుండా ఉన్నతాధికారులు, నాయకులు ప్రతి రోజు ప్రయాణాలు చేసిన పట్టించుకోవడం లేదని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వంతెన మీదుగా వేలాది సంఖ్యలో మంథని నుంచి కొయ్యూర్ మీదుగా కాటారం, కాళేశ్వరం, భూపాలపల్లికి వాహనాల రాకపోకలు సాగుతాయి. ఇసుక రీచ్ల ద్వారా నిత్యం వందల సంఖ్యలో లారీలు ఇదే వంతెన నుంచి నడుస్తున్నాయి. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి వంతెనకు మరమ్మతులు చేపట్టి ఇబ్బందులు లేకుండా చూడా లని ప్రజలు కోరుతున్నారు.



తవ్వడంతో ఏర్పడిన గుంతలు

మరమ్మతులు చేపట్టాలి



సోమన్‌పల్లి వంతెనకు అధికారులు వెంటనే మరమ్మతులు చేపట్టాలి. వంతెనపై ఉన్న సిమెంట్ తొలిగి పోయి రాడ్లు, పట్టి పైకి తెలి పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఈ వంతెన మీదుగా ప్రయాణం చేయాలంటే భయమేస్తుంది. ఎటువంటి ప్రమాదాలు జరగక ముందే బాగు చేయించాలి.

– బాపు యాదవ్, యూవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఎస్ఎస్ తాడ్వాయి: సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు



ములుగు రూరల్: మల్లంపల్లిలో..

ఎస్ఎస్‌తాడ్వాయి: మండలంలోని కాటాపూర్‌లోని జెడ్పీ పాఠశాలలో 2003–04 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. పూర్వ విద్యార్థులు ఒక చోట కలుసుకుని ఒకరికొకరు యోగక్షేమాలను తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. పాఠాలు చెప్పిన గురువులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాందాస్, ప్రభాకర్, ఉపేందర్, రామ్మూర్తి కల్యాణి, మాధవి, రఘుపతి, పూర్వ విద్యార్థులు సందీప్, గాయాస్, మనోజ్, నరేందర్ రెడ్డి, మహేందర్, సురేష్, వెంకటేశ్, సరిత, సృజన, జ్యోతి, నామణి, స్వప్న, తిరుమల పాల్గొన్నారు.

ములుగు రూరల్: మల్లంపల్లి మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1999–2000 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకున్నారు. విద్యార్థులు చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనాటి ఉపాధ్యాయులను సన్మానించారు. ఉపాధ్యాయులు విజయలక్ష్మీ, వెంకటచలం, సుకురుద్దీన్, రామ్‌బ్రహ్మం, రాజమౌళి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు





గాయపడిన వెంకటేశ్, నర్సింహారావు

వాజేడు: మండల పరిధిలోని బొమ్మన పల్లి ఏడ్జర్లపల్లి గ్రామాల మధ్య ద్విచక్ర వాహనం అదుపు తప్పి కింద పడటంతో ఇద్దరికి గాయాలైన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు, 108 సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం ఏడ్జర్లపల్లి గ్రామానికి చెందిన బద్ది వెంకటేశ్, మంచర్ల నర్సింహారావు ఇద్దరు ద్విచక్ర వాహనంపై బొమ్మనపల్లికి వెళ్లి వస్తున్నారు. ఈ క్రమంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పి కింద పడి పోయారు. దీంతో ఇద్దరికి గాయాలు కాగా ఇద్దరిని 108 అంబులెన్స్‌లో ఏటూరునాగారం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బద్ది వెంకటేష్‌ను మెరుగైన వైద్యం కోసం వరంగల్ తరలించినట్లు తెలిసింది.